ఓం నారాయణ - ఆదినారాయణ

# అవధూత లీల

## అధ్యాయము - 2
## అనికేతుడు



ఈ విధంగా "చాకలియోగం - మంగలియోగం" అని అరుస్తూ నిర్జన ప్రదేశాలలో పరుగులు తీస్తున్న సోంపల్లి పిచ్చెంకయ్య ఇరవై సంవత్సరాల వయస్సులో ఇల్లు వదలిపెట్టి ఎటో వెళ్ళిపోయారు. కొంత కాలం వీరి జాడే తల్లిదండ్రులకు తెలియలేదు. ఈ కాలంలో వీరిని ఏ సాధువయ్య అనుగ్రహించాడో ఎక్కడెక్కడ తపస్సు చేశారో అన్న విషయాన్ని గురించి శ్రీస్వామివారు ఒక్కొక్కరికొక్కక్క విధంగా చెప్పియున్నారు. మోపూరు దశయ్యతో శ్రీస్వామివారు చెప్పారట. "అయ్యా, నేను అడవులలో అక్కడక్కడా తిరుగుతూ వుంటే సాదయ్యగారు కలిశారు. 'కళ్ళు మూసుకోమ'న్నారు. అంతే మరుక్షణంలో పెంచలకోన బిలంలో ఉన్న సాదయ్యల మధ్య ఉన్నాను. కళ్ళు తెరిచేసరికి అదంతా పెద్ద ఋషీశ్వరుల సంఘం. అచ్చుట కొన్నాళ్ళున్నాక సాదయ్య మరలా 'కళ్ళు మూసుకోమ'న్నారు. నేను కళ్ళు మూసి తెరిచేసరికి మద్రాసు హైకోర్టు దగ్గర వున్నాను" అని.

ఇల్లు వదలి వెళ్ళిన పిచ్చెంకయ్య తిరిగి ఆ గ్రామస్థుల కంటపడేటప్పటికి 'శ్రీ వెంకయ్యస్వామి' అనే నామధేయముతో అందరికీ ఆపద్బాంధవుడుగా విరాజిల్లుచున్నారు. తన వారెందరు ప్రాధేయపడినా తిరిగి తన ఇంటికే వెళ్ళలేదు. సరిగదా తన గ్రామములోనే అడుగు పెట్టలేదు. అరుదుగా వెళ్ళినా ఊరి వెలుపల దొడ్లలోనూ, చేలలోనూ కొంతసేపు వుండి వెళ్ళిపోయేవారు.

మోకాళ్ళకు పైన కట్టిన చినిగిపోయిన పంచె, చినిగిపోయిన చొక్కా, చేతిలో ఉగ్గం పెట్టిన ముంత, పంగాలు కర్రతో ఏకాంత ప్రదేశాలలో సంచరిస్తూ, వయస్సులో ఉన్న స్త్రీలు కనిపిస్తే దూరంగా వెళుతూ ఉండేవారు. నిప్పంటించిన కపిల మోకు ముక్క ఒకటెప్పుడూ చేత పట్టుకొని ఉండేవారు. కపిల మోకుల ముక్కలన్నీ కట్టకట్టి నెత్తిన పెట్టుకొని తన వెంబడి తీసుకు

వెళ్ళేవారు. కొన్నాళ్ళు పెన్నానది వెంబడిగాని, సమీప అడవులలోను సంచరించేవారు.

అటు తరువాత చలమానాయుడు వారి సేవకు అంకితమయ్యాక పెన్నబద్వేలు కొండపై గుడిసె నిర్మించుకొని, అందులో చిన్న నూనె దీపం పెట్టి, తంబుర మీటుతుండేవారు. చలమానాయుడు సమీప గ్రామానికెళ్ళి భిక్షాన్నం తెచ్చేవారు. అనేకమంది గ్రామస్తులు పశువుల జబ్బుల నుండి, కలరా, మశూచి వంటి బాధల నుండి రక్షణ పొందేవారు. భక్తులకు ప్రశ్నలు కూడా చెప్పేవారు. ఆ ప్రశ్నలు చెప్పే పద్ధతి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. వివాహానికి సంబంధాలు చూస్తూ, ఏ సంబంధం మంచిదని శ్రీస్వామివారి నడిగేవారు. ఒక్కొక్క సంబంధమునకు గుర్తుగా ఒక్కొక్క రాయి చొప్పున ఎన్ని సంబంధాలు చూస్తే అన్ని రాళ్ళు వరుసగా పెట్టమనేవారు. తంబుర మీటి, "తూర్పు నుండి రెండవది" అనిగానీ, "పడమర నుండి మూడవది" అనిగానీ చెప్పేవారు. అంటే తూర్పు నుండి రెండవరాయి ఏ సంబంధం సూచిస్తూ పెట్టుకున్నారో అది మంచిది అని అర్థం. సాధారణంగా ప్రశ్నలు చెప్పేవారి మాటలు నూటికి నలభై కూడా నిజం గావు. కాని శ్రీస్వామివారు చెప్పినట్లు జరుగలేదంటే కారణం శ్రీస్వామివారు చెప్పిన దానిని వారర్థం చేసుకోవడం పొరపాటై ఉంటుంది.

బద్వేలు వదలిన తరువాత శ్రీస్వామివారు కొన్ని సంవత్సరములు కోటితీర్థం వద్ద దేవాలయములో బస చేశారు. ఇక్కడ శ్రీస్వామివారు తంబుర ముందు పెట్టుకొని రాత్రింబవళ్లు రెండు చేతులలో రెండు ఈత పుల్లలు తీసుకొని నాదం మీటుతూ "ఓం నారాయణ ఆదినారాయణ" అనే మంత్రాన్ని పెద్దగా ఉచ్చరిస్తూండేవారు. తంబుర తీగలు తెగిపోయినా గానీ వారు పుల్లలు ఆడిస్తూ మంత్రం చెబుతూనే ఉండేవారు. మన లోకంలో లేకుండా నామం చేసేవారు ఎప్పుడో స్పృహ వచ్చినప్పుడు తంబుర తీగెలు మరలా ముడేసుకొనేవారు. అప్పుడప్పుడూ అగ్నిని కూడా వ్రేల్చేవారు. చలమానాయుడు మొదలైన సేవకులు భిక్షాన్నం తెచ్చేవారు.

అటు తర్వాత కొన్నాళ్ళు సంచారం చేస్తుండేవారు. సాయిబాబా ధరించిన కఫ్నీలాంటి చొక్కా (మోకాళ్ల క్రింద వరకూ వుండే జుబ్బా)

ధరించేవారు. ఈ చొక్కాకి సిరాతో అరచేతి ముద్రలు, వేలి ముద్రలు అద్ది వుండేవి. కొన్ని కఫ్నీలపై “రామ రామ” అనే అక్షరములు అచ్చు వేసి వుండేవి. నిరంతరమూ సిరాతో కాగితముపై తమ బొటనవేలి గుర్తులు వేసి, ఆ కాగితములు భక్తులకు ప్రసాదించేవారు. అలా ప్రసాదించేటప్పుడు తమ కుడి అరచేతిని తమ నడినెత్తికి తాకించి తర్వాత ఆ ముద్రలు వేసిన కాగితానికి తాకించి భక్తులకిచ్చేవారు. నెల్లూరులోని అనేక గ్రామాలలో సంచరిస్తూ ఉండేవారు. చలమానాయుడు, పోలిరెడ్డి వగైరా సేవకబృందం స్వామితో పర్యటిస్తూ ఉండేవారు. నిరంతరం వేలిముద్రలతోపాటు అరుదుగా అగ్ని సేవనం కూడా చేసేవారు. రోజుకు ఎన్ని రీముల కాగితాలు, ఎంత సిరా వాడేవారో చెప్పలేము. శ్రీస్వామివారి కృపవలన వ్యాధులు నివారించుకున్నవారు ఎందరో ఈ నిరంతర యజ్ఞానికి కాగితములు, సిరా బిళ్ళలు బస్తాలకొద్ది సమర్పించేవారు.

అటు తరువాత వేలి ముద్రలు తగ్గించి ఎక్కువగా అగ్ని గుండం వేసి నిరంతరం రాత్రింబవళ్ళు గుండం చెంత ఉండి కట్టెలు సవరిస్తూ అర్థంగాని మాటలు మాట్లాడేవారు. రోజుకు కనీసం రెండు మూడు బండ్ల కట్టెలు కాల్చేవారు. ఎంత వర్షమైనా, మండుటెండైనా సరే అగ్ని చెంత కూర్చోనుండేవారు. వెంకయ్యస్వామి పందిరి అనే నానుడి ఒకటుంది. శ్రీస్వామివారు ఉదయం పదిగంటల ప్రాంతంలో సూర్యకిరణములు తన తలపై పడకుండా ఉండేందుకు ఒక కర్ర నాటి, దానికి తాటిమట్ట తగిలించేవారు. తాటిమట్ట తగిలించిన ఒక అరగంట వరకూ నీడ వుంటుందిగానీ, అటు పైన నీడ ప్రక్కకు జరిగి శ్రీస్వామివారు ఎండలోనే వుండేవారు. శ్రీస్వామివారు అగ్నిని వ్రేల్చేపనిలో నిమగ్నమైతే ఇక మన లోకంలో వుండరు గనుక యిది నీడా, ఎండా అనేది తెలిసేది గాదు. రెండు, మూడు పగళ్ళు, రాత్రులు అలాగే అగ్నిముందు కూర్చునియున్న రోజులున్నాయి. ఎప్పుడో ఆ గుండానికి సమీపంలోనే గోనె సంచిపై పడుకొని యోగనిద్రకు ఉపక్రమించేవారు. ఈ దశలో మొలకు పంచె కొన్నాళ్లు, కౌపీనం కొన్నాళ్లు ధరించేవారు. శరీరానికి చొక్కాగానీ, బనీనుగానీ ధరించేది లేదు. చివరి వరకు ఎపుడూ కాళ్ళకు పాదరక్షలు ధరించి ఎరుగరు.

అటు తరువాత నెల్లూరు తాలుకా, గొలగమూడి అను గ్రామం చేరి, సుమారు ఎనిమిది సంవత్సరాలు ఒకే చోట అగ్నిగుండం వేశారు. రోజుకు

సుమారు ఐదారు బండ్ల కట్టెలు కాల్చేవారు. ఈ ఎనిమిది సంవత్సరములు శ్రీస్వామివారు అగ్నిగుండం వేసిన స్థలంలోనే నేడు ఆయన సమాధిమందిరం వెలిసింది.

రమణయ్య అనే భక్తుడు దున్నపోతుల బండితో, అగ్నిగుండానికి నిరంతరం కట్టెలు తోలుతుండేవారు. మోపూరు దశయ్య, వెంకటయ్య మొదలగు సేవకులు శ్రీస్వామివారికి కట్టెలు, బొంతజెముడు చెట్లు కొట్టేవారు. పగటిపూట అప్పుడప్పుడు శ్రీస్వామివారు కూడా వీరితోటి అడవికి వెళ్ళేవారు. అయితే శ్రీస్వామివారు కట్టెలు కొట్టే తమ సేవకుల నుండి కొంతదూరంలో ఏకాంతంగా తిరిగేవారు. కొన్నాళ్ళు ఫలానాఫలానా చెట్లు మాత్రమే కొట్టమని శ్రీస్వామివారు చూపేవారు ఈ నిరంతర అగ్నిగుండం వలన కొన్ని మైళ్ళ దూరం అడవి సమూలంగా నిర్మూలనమైంది. "ఇదంతా పంట చేలవుతాయయ్యా, ఇక్కడంతా ఊరవుతుంది. గోవు పాదమంత స్థలం చిక్కదు" అని ఆనాడు శ్రీస్వామివారు చెప్పిన మాటలు ఈనాడు నిజమైనాయి.

శ్రీస్వామివారు ఎక్కువగా తమకు బుద్ధి పుట్టినప్పుడల్లా తమకు తోచిన గ్రామాలలో సంచరించేవారు. తరువాత వారి కాళ్లు ఏ కారణంగానో స్వాధీనంలో లేకుండా పొయ్యాయి. వైద్యం చేయించాలంటే శ్రీస్వామివారు సుతరాము ఒప్పుకోలేదు. "పూర్వం నేనొక ఆవును కొట్టాను. దాని ఫలితమే యిది. కనుక దానిని నేననుభవించి కర్మ దోషాన్ని పోగొట్టుకోవాలి. కనుక నేను మందు తీసుకోను" అని ఖండితంగా చెప్పారు.

శ్రీస్వామివారు నడవ లేనందున ఒక చోటే వుండేవారు. ఒక రోజు తన సేవకుడు రోశిరెడ్డితో, "నన్ను తాటాకు మీద కూర్చోబెట్టి కొంచెం దూరం లాక్కుపోయ్యా" అనడిగారు. అతడలానే చేశాడు. తాటాకుమీద తీసుకుపోవడం శ్రీస్వామివారికి బాధగా ఉంటుందని ఆరు అంగుళాలు ఎత్తుగల నాలుగు చక్రాల బండిని చేయించి దాని పై కూర్చోబెట్టి శ్రీస్వామివారు కోరిన చోటుకు భక్తులు లాక్కుపోయేవారు. ఒక్కొక్కప్పుడు బండి గతుకుల్లోపడి వళ్లంతా అదిరేది. తరువాత భక్తులు డోలిలో మోసుకుపోతామని అడిగి, స్వామి అంగీకరించగా, వారలా శ్రీస్వామివారిని మోస్తుండేవారు. ఈ విధంగా మహాసమాధికి రెండు సంవత్సరముల ముందు వరకూ శ్రీస్వామివారు నెల్లూరు, పొదలకూరు,

చిట్టేపాళెం, పెన్నబద్వేలు, కుల్లూరు, రాజుపాళెం, సోమశిల, కోటితీర్థం, ఇనుకుర్తి, ముదిగేడు, దేగపూడి, తలుపూరు, కలిచేడు, నవకోటిసిద్ధలయ్యకోన, చెర్లోపల్లి, తిరుపతి, కంచి, సంగం, నెల్లూరు, పెనవర్తి, మైపాడు, ఇందుకూరుపేట, గొలగమూడి మొదలగు ప్రదేశాలలో తరచుగా సంచరిస్తూండేవారు. శ్రీస్వామివారు ఏనాడూ గృహస్థుల నాశ్రయించలేదు. దేవాలయము, పాడుబడ్డ ఇళ్ళు, చావడి, పాఠశాల, వేపచెట్టు మొదలగు వాటిని ఆశ్రయించేవారు. నిష్కపటమైన భక్తిశ్రద్ధలతో గృహస్థులు మనస్ఫూర్తిగా ఆర్తితో ఆహ్వానిస్తే వారి గృహములకు వెళ్ళేవారు, కానీ, అక్కడ కూడా వారి ఇంటి బయటగానీ, కొట్టాలలోగానీ, వరండాలోగానీ ఉండేవారు.

వర్షమొచ్చి తడుస్తున్నప్పుడు చూరు క్రిందనైనా వదుక్కుంటారేగానీ ఇంట్లోకి రారు. ఎక్కడైనా ఇండ్లలోకి వచ్చి ధుని వేశారంటే ఆ ఇంటివారు చాలా అదృష్టవంతులన్నమాట.

శ్రీస్వామివారు ఒక్కరే తిరిగేటప్పుడు తీవ్రంగా ఆకలైనప్పుడు భగవంతుడు చూపిన ఇంటికి వెళ్ళి, వాళ్ళు పెట్టింది తిని, వెళ్ళిపోయేవారు. అయితే అన్నం ఉంచుకొని లేదని చెపితే ఫలానా చోట, ఫలానా ఉట్టి మీద ఫలానా కూర ఉన్నదని తాను చూచినట్లు చెప్పేవారు. కనుక పిచ్చి వెంకయ్య సామాన్యుడు కాడని అడిగినవారు తప్పక అన్నం పెట్టేవారు. దానికి వందరెట్లధికంగా ప్రతిఫలం పొందేవారు.

శ్రీస్వామివారు బాగా నడిచే రోజులలో ఏనాడూ పాదరక్షలు ధరించేవారు కాదు. అడవులలో తిరుగుతుండేవారు. ముండ్లు గ్రుచ్చుకుంటే తీయించుకొనేందుకు మల్లెముల్లు, సూది, దబ్బనం, చాకు, తమతో ఎప్పుడూ ఉంచుకొనేవారు. వారి కాళ్ళలో నుండి ఒక్కొక్కసారి భక్తులు రెండంగుళాల పొడవుగల ముళ్ళను కూడా తీసిన సందర్భాలున్నాయి. అది చూచిన వారు ఆశ్చర్యపోయేవారు.

శ్రీస్వామివారు గుండం వేసుకొనేటప్పుడు గుండానికి నాలుగు అంగుళాలు దూరంలో తల ఉంచి పడుకోవడం చూచాను. అంత దగ్గరలో మనం ఉంటే ఆ సెగకు మనం ఓర్చుకోలేము.

తమ తోట దగ్గర ఒక గుంట త్రవ్వి పెన్న నీళ్ళను ఒక కాలువ ద్వారా ఆ గుంటలకు పెట్టి ఆ గుంటలోని నీళ్ళను ఏతము ద్వారా తమ తోటలకు పెట్టుకుంటారు రైతులు. శ్రీస్వామివారు అచ్చటకు వెళ్లి ఆ కాలువలోని నీటిలో సగం నీరు పెన్నకు వదిలేవారు. మిగిలిన సగం నీరు తోటకు మడవ కట్టాలంటే ఇద్దరు మనుషులవసరమయ్యేవారట. అంత ఎక్కువగా నీరు పారేవి.

వారు ఉన్మత్తావస్థలో తిరుగుతుంటే ఒకచోట దొంగతనం జరిగి పోలీసులు దొంగల కొరకు వెదుకుతూ శ్రీస్వామివారిని అనుమానించి పోలీసు స్టేషనులో పెట్టారు. రెండు రోజులు మాట పలుకు లేకుండా శ్రీస్వామివారు అచ్చట కూర్చున్నారు. తరువాత పోలీసులు వదిలేశారు. అక్కడి నుండి నేరుగా దక్షిణాదిన రాజపద్మాపురంలోనున్న తన చెల్లెలు మంగమ్మ దగ్గరకెళ్లి చెప్పుకొని ఒకేమాయిన ఏడ్చారట. శ్రీస్వామివారు ఏడిస్తే మంగమ్మ ఏడ్చేది. చూచేవారికేమి అర్థం కాలేదు. తరువాత విషయం తెలిసి “నిన్ను నిర్బంధించిన వారిని తీసుకొచ్చి కొడ్తాంలే వెంకయ్యా” అని ఓదారిస్తే పసిపిల్లవాడిలాగా ఏడ్పు మానారు.

అక్కడక్కడా తిరిగి సాయంకాలానికి అన్నానికి చెల్లెలి దగ్గరకు వెళ్లేవారు శ్రీస్వామివారు. ‘వెంకన్న దండగ తిండి తింటున్నా’డని బావమర్దులు ఏ మాత్రం అసంతృప్తిగా వున్నాసరే, యిక అక్కడ నిలిచేది లేదు. శ్రీస్వామివారు వస్తే మౌనంగా అన్నం పెట్టి తలుపేసి మనం బయటకొస్తే తింటారు. మనం వారి అన్నం దగ్గర వుంటే “మీరు బయటకు పొండి తింటాను” అనేవారు.

సాయంకాలము దాకా చేలలోను, అడవిలోను తిరిగి, తిరిగి వచ్చేటప్పుడు రెండు శేర్లు గుత్తి వేరుశనగకాయలు ఏరి మూట గట్టుకొచ్చి చెల్లెలికిచ్చి అన్నం తిని వెళ్ళేవారు. వారికి ఋణపడరాదని కాబోలు శ్రీస్వామివారు అలా చేసేవారు.

ఇంటి నుండి బయటకు వెళ్లాక మరలా తమ స్వగ్రామమైన నాగుల వెల్లటూరు రాలేదట. ఒకసారి ఆయన ప్రక్క గ్రామాలలో వుంటే శ్రీస్వామివారి తమ్ముడు వెళ్ళి పిలిస్తే వచ్చారు. జొన్న కోత కోస్తుంటే శ్రీస్వామివారు కూడా కోతకు వంగి “చాకలి యోగం, మంగలి యోగం” అని అరుస్తూనే ఇద్దరు మనుషుల కోత కోశారు. నాలుగు రోజులు కోయవలసిన కోత రెండు రోజులలోనే అయిపోయిందట.

"స్వామి" అని ప్రఖ్యాతిగాంచాక వీరు ఫలానా చోట ఉన్నారని తెలిసి వీరి తల్లిగారు తినుబండారాలు చేసి తీసుకువెళ్ళి సమర్పిస్తే వాటిని తమతోనున్న వారందరికీ సమానంగా పంచమని, తరువాత చాలా స్వల్పంగా సేవించారు. ఒక రోజున శ్రీస్వామివారు మంగమ్మ గారింట రాత్రి భోజనం చేసి వెళ్ళి అంతలోనే మరలా వచ్చి "బావా! మంగమ్మ ఏదో మందు పెట్టింది. ఒళ్ళంతా సూదులతో గుచ్చినట్లు మంటలు, చురుకలుగా ఉంది. అన్నం పెట్టండి" అన్నారు. అప్పటికి అందరూ భోజనం చేసి పడుకొన్నారు. "ఇప్పుడెక్కడ వెంకయ్యా, అన్నం లేదు. ప్రొద్దున వండి పెడతాము" అన్నారు. అట్లయితే వడ్లుగానీ, రాగులుగానీ పెట్టమని అడిగారు. రెండు శేర్లు రాగులు పెట్టించుకు పోయి వాటిని తాను తినకుండా చీమలకు పోశారు. చీమల ఆకలి తీరితే ఆయన ఆకలి తీరుతుంది గాబోలు!

బద్వేలు గ్రామం వద్ద అంకాళమ్మ బోటు అనే చోట పెన్నానది ఇరవై అడుగుల వెడల్పు గలిగి పారుతుంది. శ్రీస్వామివారు అచ్చట ఆ నదికి స్వయంగా ఇసుక మోసి ఐదడుగుల ఎత్తున కట్టవేసేవారు. అలాంటప్పుడు జయరామరాజు, వెంగయ్య ఇసుక మోసి శ్రీస్వామివారికి సహాయం చేసేవారు. పెన్నా నది ప్రవాహం ఆగి నీళ్లు నిలిచాక, ఆ నీళ్ళ నుండి రెండడుగుల వెడల్పు కాలవ తీసి, ఆ నీటిని నదీ ప్రవాహ దిశకు వ్యతిరేక దిశలో కొంత దూరం పారించి, తిరిగి ఆ నీటిని నదీ ప్రవాహములో కలిపేవారు. ఆ విధంగా ఆ చిన్న కాలువ నీరు నదీ ప్రవాహములో కలిసే చోట కంప తుక్కు నీటిపై పెట్టి తన యొద్ద నున్న కాల్చిన కపిలమోకు నిప్పు ఆ కంపకు పెట్టేవారు. మంటవేస్తూ మనుషులనెవ్వరినీ దగ్గరకు రానిచ్చేవారు కారు.

ఆ నీటిని ముంతతో తీసుకుని మంటకు ఇరువైపులా తిరగబోస్తూ వుండేవారు. సేవకులతో అనేవారు, "అయ్యా! ఈ నీళ్ళ విలువ ఎంత అనుకున్నావు? తులం మున్నూరు కోట్లు. ఈ రోజు లోకం అంతటికీ ఖర్చుకు పోను ఇంకా డబ్బు మిగిలింది" అనేవారు. "ఎందుకు స్వామి ఇదంతా?" అంటే, "పెద్దమ్మవారు, దూములు (వైద్యమునకు అలివిగాని కలరా), పాపమూ తగ్గేందుకయ్యా" అనేవారు.

ఒకొక్కప్పుడు సేవకుల చేతిలో పైసా ఉండదు. "ఇప్పుడే తిరువళ్లూరు పోవాలి, కదలండి. నెల్లూరు, జొన్నవాడ, కంచి మొదలగు దేవస్థానములకు

పోవాల"ంటారు శ్రీస్వామివారు. "డబ్బు లేదు స్వామి!" అంటే "వస్తుంది కదలండయ్యా!" అని తొందర చేసేవారు. శ్రీస్వామివారు చెప్పినట్లే ప్రయాణానికి ఎవరో ఒకరు వచ్చి దక్షిణ రూపంలో అవసరమైనంత డబ్బు సమర్పించి పోయేవారు.

ఒక మిట్ట మధ్యాహ్నం తలుపూరులో భక్తులు అన్నం వండుతున్నారు. "వెంటనే కదలండి. ఒక్క క్షణం ఉండకూడదు" అని సేవకులు ప్రయాణమైన దాకా ఊరుకోలేదు. అన్నం ఉడుకుతుందంటే "అన్నం వస్తుందిలే పదండయ్యా" అన్నారు. అన్నం ఆశ వదిలేసి బస్టాండుకొచ్చారు. పొదలకూరు వైపు వెళ్ళే బస్సు వచ్చింది. "ఇది కాదయ్యా మన బస్సు. తరువాత బస్సుకు పోదాం" అన్నారు. "ఈ పాటికి అన్నం తిని వచ్చే వాళ్లముగదా స్వామీ" అంటే "అన్నం వస్తుందయ్యా ఉండండి" అన్నారు. "డబ్బు లేదు స్వామీ చార్జీలకు" అంటే "పై వాళ్ళు పంపుతారులే" అన్నారు. అన్నట్లే కొంత సేపటిలో పొట్టేపాళెం ఆదిలక్ష్మమ్మగారు స్వామి దర్శనార్థం కారులో వచ్చి గంపలో దోశలు, వడలు, పొంగలి, పులిహోరా మొదలైన పదార్థాలు తెచ్చి తృప్తిగా తినబెట్టి అవసరానికంటే ఎక్కువగా దక్షిణ సమర్పించి వెళ్ళారు.

ఒక్కొక్కప్పుడు ఒకే ఊరిలో రెండు, మూడు చోట్ల మకాం మార్పించేవారు. ఫలానా దిశ వైపు పోవాలంటే ఎంత యిబ్బందిగానీ, మార్గం దుస్తరంకానీ వెళ్ళి తీరాల్సిందే. అన్నం తిననీ, తినకపోనీ, ఎండనక, వాననక, వెళ్ళాలంటే వెళ్ళితీరాలి. శ్రీస్వామివారు నడిచేటప్పుడు కూడా అలానే తిరిగేవారు.

అడవిలో శ్రీస్వామివారు ఏంచేస్తారో చూడాలని అనేక మంది ప్రయత్నించారు. కాని ఎవరైనా తనను వెంబడించినట్లు తెలుసుకున్నారంటే వెంటనే ముండ్లలో అడ్డదిడ్డంగా నడిచేవారు. ఆ ముండ్లలో నడవలేక అలా ప్రయత్నించినవారు వెనుతిరిగి వచ్చేవారు.

పండ్లు తోమటం, పుక్కిలించడం అనేది లేదు. చప్పరిస్తున్న పొగాకు వుమ్మేసి వెంటనే గంజి త్రాగేవారు.

ఒక రోజు నా (రచయిత) ఆయాసము శ్రీస్వామివారి సన్నిధిన కూర్చున్న వెంటనే నివారణ అయినందున ఆనందోత్సాహంతో కనబడిన

ప్రతివారికీ స్వామి విషయం చెపుతున్నాను. శ్రీస్వామివారు ఒక రోజు ఏకాంతంగా అన్నారు. "ఎట్లంటే అట్లా మాట్లాడుతావేమి?" అని. అంతటితో నోరు కట్టేసుకోమని ఆత్మబోధ చేశారు శ్రీస్వామివారు. మరొక గొలగమూడి నివాసి చెప్పారు. "అయ్యా! నన్ను గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారే, అది తప్పుగదయ్యా" అని శ్రీస్వామివారు అన్నారట. మరొకప్పుడు "వీళ్ళప్పుడే మూటవిప్పి బండ్లకెత్తుతున్నారు. వద్దని చెప్పమ్మా" అని తులశమ్మతో చెప్పేవారు.

పై విధంగా తన మహిమ గోప్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కోట్లు, పడగలు, రాసులు అని పరిభాషతో మాట్లాడేవారు. దాని భావం జనానికి అర్థం కాక ఎక్కువ మంది తిరిగి వారిని దర్శించేవారు కాదు.

అప్పుడప్పుడూ నియమం లేకుండా బుద్ధి పుట్టినప్పుడు క్షౌరం చేయించుకొనేవారు. అందరూ మంగలికి 50 పైసలు యిస్తే శ్రీస్వామివారు రూ.1-00గానీ, రూ. 2-00లు గానీ ఇచ్చేవారు. 1980 తరువాత వారు కోరకున్ననూ సేవకులు అప్పుడప్పుడూ గుండు చేయించి, మీసాలు తీయించేవారు. శ్రీస్వామివారి భక్తులలో బరిగెల నాగయ్య ముఖ్యంగా ఈ సేవ తానే స్వయంగా చేసేవాడు. స్వామి వయస్సులో వుండి తిరిగేటప్పుడు గిరజాలు, మీసాలు ఉండే ఫోటో చూడవచ్చు.

మహా సమాధికి ముందు ఒక సంవత్సరం నిరంతరం తన రెండు పిడికిళ్లనూ బిగించి వేళ్ళు వూడదీయ నిచ్చేవారు కాదు. ఎంతటి రుగ్మతలో ఉన్నా, యోగస్థితిలో ఉన్నా కూడా ముందుకు జరిగి, మూత్ర విసర్జన చేసేవారు గానీ, తన పరుపుల మీద విసర్జించేవారు కాదు. శ్రీ రోశిరెడ్డిగారు శ్రీస్వామివారి మూత్రాన్నంతా ఒక్క బొట్టు వదలకుండా తీర్థంగా త్రాగేవారు.

కనుకనే రోశిరెడ్డి కంటి చూపులేకున్నా, అన్నం మానివేసి అటుకులు, ద్రవాహారంతో జీవిస్తున్నా, చివరిరోజుల వరకు కూడా ఊరిలో భిక్షకు వెళ్ళి భక్తులకోసం భిక్షాన్నం తెచ్చే తన సేవను దీక్షగా చేస్తూనే ఉన్నారు. సేవకులు స్వామి సేవ చేస్తే, ఈయన ఈ విధంగా సేవకులకు సేవ చేస్తున్నాడు. అచంచలమైన వారి విశ్వాసమే వారి బలం.

శ్రీస్వామివారికి నియమితమైన దినచర్య అంటూ ఏమీలేదు. ఒక్కొక్కప్పుడు రెండు రాత్రులు రెండు పగళ్ళు నిరంతరం "బండి ఆపండయ్యా"

అనిగానీ, మరేవో యితర మాటలు గానీ అరుస్తూ, ఒకే ఆసనంలో కదలక కూర్చునేవారు. వారు అరిచే మాటలను మరొకరు పెద్దగా చెప్తూ వుండాలి. ఒక్కొక్కసారి రాత్రింబవళ్ళు యోగనిద్రలో ఉండేవారు. అమాయకులు మాత్రం శ్రీస్వామి వారు బలహీనమై నిరంతరం నిద్రలో ఉన్నారని తలచేవారు. అట్టి నిద్రలో కూడా వారు సర్వజ్ఞత్వం ప్రదర్శించి భక్తులనాదుకొనటం ఎందరికో అనుభవం.

ఉదాహరణకు 1978 లో ఒక రోజు శ్రీస్వామివారు ఒక రోజంతా (రాత్రి, పగలూ) నిద్రలో ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు హఠాత్తుగా లేచి కూర్చుని, అప్పుడే నామస్మరణతో నడచివచ్చిన నాకు ఒక చీటి వ్రాయించి, ఆశీర్వాదముద్రవేసి ఇచ్చి వెంటనే ముసుగు కప్పుకొని మళ్ళీ నిద్రకు ఉపక్రమించారు. భక్తులు జావ త్రాగమని ప్రార్థించినా వినిపించుకోలేదు. ఐదు నిమిషాలకల్లా మా అవ్వగారు మరణావస్థలో వున్నారని, నన్ను వెంటనే రమ్మని మనిషి వచ్చాడు. నేను వెంటనే కలిచేడు వెళ్ళి, శ్రీస్వామివారి పాదతీర్థం, ఊదీ ఆమె నోటిలో వేస్తే మ్రింగింది. తులసి నీళ్ళు కూడా త్రాగింది. మందు పోస్తానంటే నోరు తెరవలేదు. శ్రీస్వామివారి పాదతీర్థం సేవించి ప్రాణం వదిలింది. ఆమె తన అంతిమ ఘడియలలో రాత్రింబవళ్ళు సాయినాథుని ప్రార్థన చేసుకున్న పుణ్యమూర్తి. కనుకనే శ్రీస్వామివారి రూపంలో శ్రీ సాయి తన ఆశీస్సుల నందించి సద్గతి ప్రసాదించారు.

పై సన్నివేశంలో శ్రీస్వామివారు నిద్రలో నున్నప్పటికి అది మన నిద్రలాంటిది కాదు. ఆ స్థితిలో వారికి మూడు మైళ్ళ నుండి తన ఆశీస్సుల కొరకు నేను పాదచారినై వస్తున్నానని తెలుసు. రెండు గంటలలో మా అవ్వ మరణించ బోతున్నదనీ తెలుసు. నన్ను పిలుచుకొని పోవడానికి మనుషులొచ్చే విషయం కూడా తెలుసు. ఆమె నిరంతరం సాయి నామము ఉచ్ఛరించిన పుణ్యమూర్తి కనుక అంతిమ ఘడియలలో ఆమెకు తన ఆశీస్సులతో సద్గతి ప్రసాదించాలని కూడా తెలుసు. కనుకనే వెంటనే నిద్ర లేచి భక్తులు బ్రతిమిలాడినా గంజి కూడా త్రాగకుండా చీటీ వ్రాయించి ఇచ్చి మళ్ళీ యోగ నిద్రకు ఉపక్రమించారు. నిజమైన యోగికి రాత్రింబవళ్ళు లేవని శాస్త్రం. అది శ్రీస్వామివారికి ఎంత చక్కగా సరిపోయిందో!

సాధన కాలంలో వీరి అనన్యమైన వైరాగ్యం చూచే వారిని ముగ్ధులను చేస్తుండేది. లడ్డు పెట్టినా వద్దనరు. కానీ కొంచెం కారం, పచ్చడి పెట్టించుకొని అందులో కలుపుకొని తినేవారు. ఒకప్పుడు భక్తులు శెనగపప్పు , బెల్లం, కొబ్బరి దంచి పొడిచేసి డబ్బాలో పోసి అందుబాటులో ఉంచితే శ్రీస్వామివారు తీసుకొని తినేవారు. ఒకరోజు శెనగల పొడి డబ్బా బదులు, భక్తులు వారి చెంత పొరపాటున తలస్నానమునకు వాడే సీకిరేణి పొడి డబ్బా ఉంచారు. సీకిరేణి పొడి తినేశారు శ్రీస్వామివారు. తెల్లవారి సేవకులు తమ పొరపాటుకు పరితాపం చెందారు. శ్రీస్వామివారు మహాసమాధికి ముందు పదిహేను సంవత్సరముల నుండి మంచినీరు త్రాగి ఎరుగరు. ఎప్పుడు త్రాగినా వేడినీటిలో చక్కెర కలిపి ఇస్తే త్రాగేవారు స్వామివారు. తననుకానీ, తనపాదములను కానీ ఎవ్వరినీ తాకనిచ్చేవారు కాదు. వారి పదిమంది సేవకులలో ఎప్పుడూ ముగ్గురికి మాత్రమే వారిని తాకేందుకు అనుమతించేవారు. వారికి పూజలు చేయనివ్వరు. వారికి ప్రదక్షిణలు చేస్తుంటే ఒకేఒక్క ప్రదక్షిణ చాలని చెప్పేవారు.

దక్ష అనే సంస్కృత పదానికి శ్రద్ధ అని అర్థము. మనకు ఎవరిపై శ్రద్ధ ఉంటుందో వారికి మన భావం వ్యక్తం చేసుకునే పద్ధతే ప్రదక్షిణలు చేయడం, దక్షిణ సమర్పించడం. మన శ్రద్ధను చూరగొన్న వారిని గూర్చి ఎంత తెలుసుకున్నా తనివి తీరదు. వారిపై నిజమైన ప్రీతిగలవారు వారి మనస్సంతా తమ ప్రీతిపాత్రుల చర్యలను, మాటలను తలుచుకుంటూ హృదయమంతా వారి ధ్యాసతో నింపుకొని పులకించిపోతారు. ఇట్టి మన అంతరంగాల బాహ్య ప్రకటనే ప్రదక్షిణ. ఈ విధంగా **మన మనస్సులు వారి చుట్టూ పరుగులు** 1
**తీసేట్లు చేసుకోండని, అప్పుడొక్క ప్రదక్షిణ చేసినా చాలని** శ్రీస్వామివారు అలా అనేవారు.

శ్రీస్వామివారికి తాటిఆకే ఆసనం, మట్టిముంతే పాత్ర, గోనె పట్టలే పరుపు, భూదేవే వారి ఊయల, రాగి అంబలి, తెల్లగడ్డ (చిన్న ఉల్లిపాయ), మిరప్పొడి ఇవే పంచభక్ష్యపరమాన్నాలు. పాత పంచలు, దుప్పట్లే వారి చీనాంబరాలు, ఎంత వైరాగ్యమూర్తో!

బాల్యం నుండి శ్రీస్వామివారికి పిచ్చెక్కిందని అందరూ తలచిన్నప్పటికి ఆయన స్వగృహంలో వున్న సుమారు 20 సం॥ లలో గాని, తరువాత ఆయన పాదచారియై సంచారముచేసే సమయంలోగాని ఒక్కసారైనా ఆయన

యెవ్వరినీ, "ఇలాంటివారు, అలాంటివారు" అని పొగిడిగానీ, విమర్శించిగానీ యెరుగరు "నాభినందతి నద్వేష్టి" అన్న సూత్రం ఆయనలో యెప్పుడూ తొణికిస లాడేది. స్వామికి ఇష్టాయిష్టాలు లేవు. తమ చుట్టూ ఉన్న సేవకులు నిరంతరం లోకాభిరామాయణం, పరనింద చేస్తున్నా కూడా ఒక్కసారైనా, "ఏమయ్యా! యిలా మాట్లాడడం తప్పుగదా!" అని చెప్పి గూడా యెరుగరు.

ఏనాడైనా తనకు "ఫలానా కూర కావాలని గానీ", "ఈ కూర బాగుంది, యిది బాగాలేదు" అనిగానీ, "ఫలానా పని యిలా చెయ్యాలి" అనిగానీ ఆయన చెప్పి యెరుగరు. ఏది లభిస్తే దానితో తృప్తిగా భోంచేసేవారు. గంజి లేదని మిఠాయి పెడితే, జిహ్వకు రుచి చూపకూడదని ఆ మిఠాయికి మిరప్పొడి కలిపి మరీ స్వీకరించేవారు! బాహ్య పరిస్థితులను లెక్కచేయక నిరంతరం ధ్యేయంవైపు సాగడమే వారి లక్ష్యమన్నట్లు నడుచుకునేవారు. ఎండ, వాన, గాలి వేటినీ లెక్కచెయ్యక నిరంతరాగ్నిని నియమంగా వ్రేల్చేవారు.

శ్రీస్వామివారు భోంచేసే విధానం గురించి దేవళ్ళ వెంకటయ్యగారిలా చెప్పారు. శ్రీస్వామివారు శిష్యబృందంతో కలిసి ఎక్కడైనా విడిది చేసినప్పుడు మొదట విస్తరి నిండా అన్నం పెట్టాలి. దానిని అంచు వెంబడి కట్టవలె చేసేవారు. స్వల్పంగా మాత్రమే మధ్యలో వుంచుకొనేవారు. మరలా అన్నం పెట్టించుకొని, మజ్జిగ వేసుకొని భోజనం పూర్తి అయిన తర్వాత విస్తరి చుట్టూ కట్టవలె వున్న అన్నాన్ని నేలపై, ఏవైపు దాన్ని ఆ వైపుకు మునివేళ్ళతో చల్లేసేవారు.

శ్రీస్వామివారు అన్నం తినేరోజుల్లో వారికి రెండు విస్తళ్ళ అన్నం వడ్డించవలసి వచ్చేది. ఒక బేసిన్ నిండుగా అన్నం తెచ్చి బోర్లించాలి. కాని గరిట, హస్తము, వగైరాలతో వప్పుకోరు. మొదట విస్తరి నిండా పెట్టిన అన్నాన్ని తమ సిరా పూసుకున్న చేత్తో తాకి తనకు ఆతిధ్యమిచ్చిన భక్తునికిచ్చేవారు. అది మనం ప్రసాదంగా తీసుకోవాలి. రెండవసారి విస్తరి నిండా అట్లానే వడ్డిస్తే దానిని తానే స్వయంగా ముద్దలుచేసి, పెద్ద ముద్దలు విస్తరి చుట్టూ పెట్టి, మిగిలిన అన్నాన్ని చిన్న ముద్దలుచేసి విస్తరి చుట్టూ యింకొక వరుస పెట్టి, అప్పుడు మిగిలిన అన్నం తినేవారు. అన్నం మరలా మారు ఎప్పుడూ వడ్డించుకునే వారుకారు. వెంకమ్మ లాంటి భక్తుల ఇండ్లకు వచ్చినప్పుడు మొదటి విస్తరిలోని అన్నం తాకి, వారికి ప్రసాదంగా ఇచ్చేవారు.

ఒక్కొక్కప్పుడు "అయ్యా! ఒక్కరవ్వ కారం పెడతావా" అని అడిగేవారు. అప్పుడు ఎండుమిరపకాయలు, ఉప్పుగల్లు, యర్రగడ్డ ఇస్తే ఆ మూడు అరచేతిలో నలుపుకొని అన్నంలో కలుపుకొని తినేవారు.

ఇది కొన్నాళ్ళు చూచి రోశిరెడ్డి ఒక భక్తురాలు దగ్గర ఎండు మిరపకాయలు, ధనియాలు, ఉప్పు వేయించి మెత్తగా దంచి పొడి చేయించి డబ్బాలో సిద్ధంగా ఉంచుకొనేవారు. స్వామివారు కోరినప్పుడు పెట్టేవారు. అప్పుడప్పుడూ అరుదుగా శ్రీస్వామివారు "కొంచెం బెల్లం పెట్టయ్యా" అని అడిగి పెట్టించుకు తినేవారు. అందువలన రోశిరెడ్డి వేయించిన శెనగపప్పు, కొబ్బరి, బెల్లం మెత్తగా దంచి డబ్బాలో సిద్ధంగా ఉంచుకొని శ్రీస్వామివారు అడిగినప్పుడు ఆ డబ్బా స్వామికిస్తే కొంచెం తీసుకుని తినేవారు. ఒక్కొక్కసారి స్వామి కరివేపాకుపొడి, చింతాకుపొడి, ధనియాలపొడి, కారప్పొడి అడిగి పెట్టించుకుని అన్నం కలిపి తినేవారు.

ఒకరోజు శ్రీస్వామివారు తన సేవకునితో "అన్నం వండి పెట్టయ్యా" అన్నారు. అలాగే తయారుచేసి, భక్తులు శ్రీస్వామివారికి సమర్పించారు. శ్రీస్వామివారు తన అరచేతిని నడినెత్తికి తాకించి తీసి అన్నానికి అద్దారు. ఇలా ముమ్మారు చేసి ఆ అన్నాన్ని స్వామి స్వల్పంగా కూడా తినకుండా ఒక భక్తునికిచ్చి, "అందరికి పెట్టయ్యా, జబ్బులు పోతాయి" అన్నారు. వారలాగే చేశారు.

ఒక్కొక్కప్పుడు "నాకు త్వరగా ఆకువక్క పెట్టయ్యా" అనేవారు. తెచ్చేలోగా అనేకసార్లు అడుగుతూ తొందర చేసేవారు. కొంచెం తిని, "చప్పగా ఉందయ్యా కారంగా చేసి ఇంకొంచెం పెట్టు" అంటూ మొదట పెట్టిన దంతా తినేసేవారు. ఈసారి సున్నం కాస్త ఎక్కువ వేసి పెడితే, "తినమ్మాతిను బాగుంది తిను" అని ఎవరో అదృశ్య వ్యక్తికి చెప్పినట్లు చెపుతూ తినేవారు. కొంచెం సేపటికి "ఇక ఆమెను పొమ్మని చెప్పయ్యా! అంతా నేను చూసుకుంటాను" అని అనేవారు.

ఒకరోజు ఆంజనేయస్వామిగుడిలో భక్తులు పాడే తత్వాలు ఆపమని "ఓం నారాయణ, ఆదినారాయణ" అనే మంత్రం తాను చెపుతూ, అందరిచేతా చాలా సేపు చెప్పించారు. అంత సేపు శ్రీస్వామివారు ఏనాడూ తానుగా చెప్పి నామం చేయించలేదు.

ఆయన జావ మాత్రం త్రాగే రోజులలో అప్పుడప్పుడూ అరుదుగా తెల్లగడ్డలు ఉడకబెట్టిగానీ, కాల్చిగానీ వొలిచి వత్తియిస్తే చప్పరించి మ్రింగేవారు. అవి కావాలని వారే అడిగేవారు కూడాను.

శ్రీస్వామివారికి జావపోసే సేవ ప్రతినిత్యం రోశిరెడ్డి చేసేవాడు. ఒకరోజతడు కట్టెలకుపోయిన సమయంలో మరొక స్వామిసేవకుడు, "ఈ రోజు స్వామికి జావ నేను పోస్తాను" అని తీసుకు పోయాడు. శ్రీస్వామివారు వద్దన్నారు. రోశిరెడ్డి కట్టెలు తెచ్చి అక్కడ వేసి అలవాటు ప్రకారం శ్రీస్వామివారికి జావ పోయబోయాడు. "స్వామికి జావ వద్దంట నీవెందుకు తీసుకుపోవడం" అని యితర భక్తులు అడ్డం చెప్పారు. రోశిరెడ్డి వారి మాట పట్టించుకోకుండా జావ తీసుకుపోయాడు. "నీవు తెచ్చావు గనుక త్రాగుతానయ్యా" అని చెప్పి శ్రీస్వామివారు జావ స్వీకరించారు. శ్రీస్వామివారికి ప్రతినిత్యం ఏ సేవకుడు ఏ సేవ చేస్తాడో అతడే ఆ సేవ చెయ్యాలి. వారు చెపితే తప్ప సేవకులు తమ నిత్యకృత్యం మార్చుకుంటే వప్పుకునేవారు కాదు.

శ్రీస్వామివారు అన్నం తినే రోజులలో కూడా రోశిరెడ్డి ఆ సేవ చేసేవాడు. ఒకరోజు మరొక సేవకుడు ఈ రోజు ఆ సేవ నేను చేస్తానని పట్టుపట్టడంతో రోశిరెడ్డి ప్రక్కకు తప్పుకున్నాడు. ఆ భక్తుడు అన్నం తెచ్చి శ్రీస్వామివారిని తినమంటే అక్కడ పెట్టి పొమ్మన్నారేగాని, తినలేదు. కొంత సేపయ్యాక శ్రీస్వామివారు రోశిరెడ్డిని పిలిచి, "పెడితే అన్నం నువ్వే పెట్టు లేకుంటే నన్ను బండిలో వేసి ఆశ్రమంలోంచి లాగేయ్" అన్నారు కోపంగా, నాటి నుండి ఇతర సేవకులెవ్వరూ శ్రీస్వామివారికి 'మేమన్నం పెడతా'మని వాదుకు వచ్చేవారుకాదు.

ఒకరోజు రోశిరెడ్డి ఉరఫ్ నాగతాతతో స్వామి ఇలా అన్నారు "కుడిచేతి అరచెయ్యి పట్టి రెండు పుడిసెళ్ళు నీళ్ళు తాగు". అంతే ఆనాటి నుండి నాగతాతగారికి దాహం నశించిపోయింది.

సామాన్యంగా గుండాన్ని సేవకులు సవరిస్తుంటే అడ్డుచెప్పని ఆయన ఒక్కొక్కప్పుడు దాని చెంత కెవరినీ రానిచ్చేవారు కాదు. తులశవ్వ నిత్యమూ ఆ గుండంలో సాంబ్రాణి వేసి నమస్కరించుకొనేది. ఒకరోజు శ్రీస్వామివారు చేతులడ్డం పెట్టి ఆమెను గుండం దగ్గరికి రానీయలేదు. బహుశా మన

స్థూలదృష్టికి గోచరించని రీతిని ఋషీశ్వరులో లేక దేవతలో గుండము వద్దకు వచ్చి యుంటారని ఈ సన్నివేశాన్ని బట్టి మనమూహించవచ్చు. ఇలాగే రోశిరెడ్డి గారిని కూడా ఒకరోజు గుండం సవరించబోతే మండుతున్న కట్టెలను తాకనివ్వక "అబ్బో! అబ్బో! ఇప్పుడు తాకవచ్చా?" అన్నారు.

ఒకసారి పచ్చి బొంతజెముడు చెట్లు ధునిలో వేసి అవి మండేందుకు ఎండుగడ్డి గుండంలో వేసి శ్రీస్వామివారు పకపకా నవ్వుతూ ఉన్నారు. కారణమడిగితే "బొంతలు పోట్లాడుకుంటున్నాయయ్యా" అన్నారు.

ఒకసారి స్వామివారు ఒక మైదానంలో ధునివేసుకొని కూర్చొని యున్నారు. శ్రీస్వామివారి విషయం తెలియక ఒక వ్యక్తి బీడీ కాల్చుకొనడానికి నిప్పుకోసం వచ్చాడు. స్వామి దగ్గర తంబుర వగైరా చూచి అతడు ఆ నిప్పుతో బీడీ కాల్చుకోవచ్చో? లేదో? నని అనుమానిస్తూనే కాల్చాలనే ఆతృతతో ఉన్నాడు. "ఏమయ్యా! బీడీ కాల్చుకుంటావా? కాల్చుకో!" అన్నారు శ్రీస్వామివారు. అది విని సేవకులు ఆశ్చర్యపోయారు. కారణం, ఆ రోజుల్లో ధునిలో ఒక్కపుల్ల వేయాలన్నా శ్రీస్వామివారు స్వయంగా వేసుకునేవారు గానీ ఎవరినీ తాకనిచ్చేవారుకాదు. కాని అవతలివారి భావాన్ని బట్టి తాము నడుచుకొనే వారని పై సంఘటన చెపుతుంది.

దక్షిణ రూపంలో వచ్చిన పైకాన్ని శ్రీస్వామివారు తన సేవకులకు వారి వారి కష్టము, అవసరాలకు తగినట్లు ఇచ్చేసేవారు. కాని తమ దగ్గర నిల్వ ఉంచేవారుకారు. పండుగలు మొదలైన సమయాలలో భక్తులు సమర్పించిన తినుబండారాలను వచ్చిన భక్తులందరికీ, తమ సేవకులకుగూడా ఎప్పటికప్పుడు పంచమనేవారు.

దశయ్య, రమణయ్య, రోశిరెడ్డి వారికి కష్టం ఎక్కువ కనుక వారికి కొన్ని తినుబండారాలు దాచి యుంచి ప్రత్యేకంగా యిచ్చేవారు.

రాత్రింబవళ్లు తమతో పాటే నిద్ర మేల్కొనే రోశిరెడ్డిగారిని ఒంటరిగా అర్ధరాత్రి సమయాన పిల్చి తమ చాప క్రింద దాచి పెట్టిన తియ్యటి పదార్థాలు ఇచ్చి పూరిపాక వెనుకకు పోయి తినమని చెప్పేవారు.

శ్రీస్వామివారికి మహాసమాధి చెందేనాటికి సుమారు 95-98 సం॥ల వయస్సు. చివరి పన్నెండు సం॥లు కేవలం ద్రవాహారంతోనే ఉన్నారు. కానీ

శరీరంపై ఎక్కడా గూడ వృద్ధాప్య చిహ్నములైన ముడతలు లేవు. ఎప్పుడూ ఎముకల కంటుకొని నున్నగా నిగనిగలాడుతున్న చర్మం చూస్తే తెలిసినవారికి యిది యోగ శరీరం అని తెలుస్తుంది.

శ్రీస్వామివారి నేత్రములలోని ప్రశాంతత, గాంభీర్యము కొట్టవచ్చినట్లు కనబడేవి. చురుకుగా చురుక్కున మెరిసే కన్నులు ఆ మహాయోగికి పెట్టక పెట్టిన ఆభరణాలు.

గురవయ్య ఎప్పుడూ శ్రీస్వామివారి తల దగ్గరే వుండి శ్రీస్వామివారు అరిచే అరుపులు తానూ అరుస్తూ నిరంతరం మేలుకొని వుండేవాడు. శ్రీస్వామివారు చేతులు వెనుకకు పెట్టి, తమ తల క్రిందనున్న దిండుపట్టుకొని, దృష్టిని ఆకాశంలో నిలిపి, అట్లానే చూస్తూ వుండేవారు. శ్రీస్వామివారి అట్టి స్థితిలో గురవయ్యకు ఒక విధమైన తన్మయత్వం కలిగి శ్రీస్వామివారిని వదిలి వెళ్ళాలని బుద్ధేపుట్టేది గాదు.

అట్టి సమయాలలో శ్రీస్వామివారిలో నుండి ఒక వెలుగు తనలోకి ప్రవహిస్తున్నట్లు గురవయ్యకి అనుభవమయ్యేది.

మహాసమాధికి మూడు సంవత్సరాల ముందు నుండి శ్రీస్వామివారు నిరంతరం సమాధి స్థితిలో నుండేవారు. కనుక పరుపు వేస్తే అభ్యంతరం చెప్పలేదు. గురవయ్యను కూడా పరుపు మీద కూర్చోమని లాగి కూర్చోపెట్టేవారు.

అంతకు ముందు వరిగడ్డిపై ఈతాకు చాపగానీ, తాటిఆకు గానీ వేసి వాటిపై పాత గోనెపట్టా కప్పి కూర్చోబెట్టేవారు. అదే వారు పడుకునే పాన్పు కూడా.

శ్రీస్వామివారు ముఖ్య భక్తురాలైన వక్కెమ్మ, భక్తితో నామజపం చేస్తూ ప్రోగుచేసిన దొండపొట్టుతో తయారు చేసిన పరుపు వేస్తే అంగీకరించారు. ఆ తరువాత ఆ పరుపు చినిగిపోయాక భక్తులు దూది పరుపులు వేశారు.

ఏ గ్రామానికి వెళ్ళినా రెండు రోజులు గడిచిందంటే శ్రీస్వామివారు మరొక ఊరికి పోవడం గానీ, లేకుంటే అదే గ్రామంలో మరొక చోటుకు తన మకాం మార్చడం గానీ జరిగేది. 'రాత్రి, పగలు నాకు తెలియటం లేదయ్యా!

అయ్యా! ఇప్పుడు ఎంత ప్రొద్దెక్కింది?' అనేవారు. రాత్రిపూట 10-3-1980 న శ్రీస్వామివారు తలుపూరు నారాయణదాసు ఆశ్రమంలో విడిది చేసి యున్నారు. గురవయ్యతో 'అయ్యా! ఇది ఏ ఊరు? అని అడిగారు. 'తలుపూరు గదా స్వామి' అంటే, 'ఆ సరే' అన్నారు. అంటే భగవద్గీతలో 'నతద్భాసయతే సూర్యో నశశాంకో నపావకః యద్గత్వా ననివర్తంతే తద్ధామ పరమం మమ' అన్న స్థితిలో శ్రీస్వామివారు వున్నారన్న మాట. దేనిని సూర్యచంద్రాగ్నులు వెలిగించలేరో, ఎట్టి స్థితిని పొందిన వారు మరలా అజ్ఞానములోనికి రారో అటువంటి స్థితే వారిది.

ఆయన నడవలేరు గనుక ముంతలో మూత్ర విసర్జన చేస్తే భక్తులు తీసేవారు. మల విసర్జన చేయాలంటే ఎవ్వరూ లేని ఊరుబయట ఏకాంత ప్రదేశానికి తీసుకుపోవాలి. నేలమీద గడ్డిగానీ, బందారాకు గానీ, తంగేడు ఆకుగానీ పరిచి దాని పైన ఈతచాప వేసి, పరుండబెట్టి మనం దూరంగా వచ్చేస్తే మల విసర్జన చేసేవారు. తరువాత వెంటనే బాగా వేడిగానున్న నీటితో స్నానం చేసేవారు. ఎప్పుడూ తన పడకపై మల మూత్ర విసర్జన చేయలేదు.

మహాసమాధికి ముందు ఒక సంవత్సరం రోజులు నిరంతరం తీవ్రధ్యాననిష్టలో వుండేవారు. స్నానానికి పెట్టిన నీరు ఏమాత్రం వేడితగ్గినా 'చలి చలి' అని కేకలేసేవారు. వేడి ఎక్కువైతే, 'అబ్బా! అబ్బా!' అని అరిచేవారు. సరైన మోతాదుగా వుంటే 'అద్దీ! అద్దీ!' అంటూ స్నానం చేసేవారు. ఒక్కొక్కప్పుడు 'ఇంక చాలమ్మ, యింక చాలు అంతే, అంతే' అనేవారు. అలాంటప్పుడు సేవకులు త్వరత్వరగా వళ్ళు తుడిచీ తుడవక మునుపే శ్రీస్వామివారిని పట్టి ఎత్తుకుపోయి, ప్రక్కపై పరుండ బెట్టేవారు. శ్రీస్వామివారి కౌపీనం పిండిన నీటిని భక్తులు భక్తితో కన్నులకద్దుకొని తీర్థంగా స్వీకరించేవారు. కొందరికి కళ్ళు మంటలు, మసకలూ వుంటే ఆ కౌపీనం పిండిన నీరు కళ్ళలో వేసుకొని తమ బాధలు పోగొట్టుకొనేవారు. మన ప్రజ్ఞలో నుండగా తమ వంటికి శ్రీస్వామివారు సబ్బు రుద్దనిచ్చేవారు కాదు. అందువలన భక్తులు ఆయనకు సీకాయ పొడి, మంగచక్కపొడి, శనగపిండితో వళ్ళు రుద్దేవారు. చివరి రోజులలో సబ్బు రుద్దినా అది ఏదైనదీ శ్రీస్వామివారు పట్టించుకునేవారు కాదు. ఆయన బాహ్యస్థితి తెలియని సమాధిస్థితిలో ఉండేవారు కనుక ఆయన అడ్డు చెప్పేవారు కాదు.

బాహ్య ప్రజ్ఞ కలిగినపుడు కాళ్ళకు, వంటికి శ్రీస్వామివారు అడిగి నువ్వుల నూనె మర్దన చేయించుకునేవారు. తన సేవకులను తప్ప ఇతరులను శ్రీస్వామివారు, తమను తాకేందుకు అంగీకరించేవారు కాదు. శ్రీస్వామివారిని స్పృశించే భాగ్యమునకు తపనపడే భక్తుల మనసు కనిపెట్టి ముల్లు తీయించు కొనే మిషతోను, నూనె మర్ధనా చేయించుకునే మిషతోనూ, తన స్పర్శ భాగ్యం ప్రసాదించేవారు.

చలికాలంలో శ్రీస్వామివారికి మంచుసోకుతుందని భక్తులు పందిరివేస్తే ఆయన పందిరి వదలి ఆరుబయటకు వెళ్ళి అక్కడ ధుని వేసుకుని కూర్చునేవారు. తలుపూరులో దోమలు ఎక్కువగా కుడుతుంటే తరచుగా స్వామి తమ వీపును దువ్వెనతో గీరమని సేవకులను కోరేవారు. వారి బాధచూచి భక్తులొకప్పుడు శ్రీస్వామివారికి దోమతెర కట్టారు. కానీ శ్రీస్వామివారు దాన్ని పీకి పారేసేవారు. శ్రీస్వామివారు కదలలేకుండా వున్న చివరి రోజులలో మాత్రం భక్తుల ప్రయత్నం సఫలమైంది. ఈ రెండు చర్యలూ శ్రీ సాయి చర్యలను ఎంతగానో పోలి వున్నాయి.

రాత్రిపూట సేవకులందరూ స్వామి చుట్టూరా చాలా దగ్గరగా పడుకునేవారు. ఎన్నడూ ఎవ్వరిని గానీ ఆయన 'లేచి పోయి దూరంగా పడుకోండి' అని ఆజ్ఞాపించి ఎరుగరు.

నిరంతరం సమాధి నిష్ఠులైయున్న శ్రీస్వామివారు తన ప్రక్కనున్న భక్తులు, సేవకులు చేసే అల్లరిగానీ, లోకాభిరామాయణము గానీ, పరదూషణగానీ, రాజకీయ విమర్శలనుగానీ చెవినబెట్టరు. ఆపమని ఎన్నడూ వారికి చెప్పేవారు కాదు. 'పోతూవుంటే పోనిచ్చేదే గదయ్యా' అన్నారు గదా ఒకప్పుడు!

చాలా అరుదుగా ఒక రోజు అన్నారు, 'ఈ రోజు ఎవ్వరూ మాట్లాడకూడదు సముద్రస్నానానికి పోవాలి, వక్కెమ్మను కూడా తీసుకుపోవాలి' అని.

కానీ చిత్రమేమంటే శ్రీస్వామివారు సముద్ర స్నానానికే బయలుదేరలేదు. కనుక వారి మాటలెవరికీ అర్థం కాలేదు. వారన్నట్లే ఆ రోజు వక్కెమ్మకు సముద్రస్నానం చేసి వచ్చినట్లు స్వప్న దర్శనమైంది. ఆ

స్వప్నం కాకతాళీయమైనది కాదని, తామే ఆమెకట్టి పవిత్రమైన అనుభూతి ప్రసాదించనున్నామని భక్తులకు తెలుపడానికే శ్రీస్వామివారు అలా అన్నారు. ఐతే ఆ రోజు ప్రత్యేకంగా ఎందుకు మౌనం పాటించాలని భక్తులెవరూ వారిని అడుగలేదు.

